సమస్యలుంటే సాక్షికి చెప్పండి
మీ సమస్యలు, ప్రజోపయోగ సూచనలు, ఇతర అంశాలను కింద ఫోన్‌నంబర్‌కు వాట్సాప్ చేయండి
90324 97123
నంబర్‌ను సంప్రదించండి

క్లుప్తంగా

ఆర్‌ఆర్‌ఆర్‌కు ఆస్కార్ రావడం గొప్ప విజయం

ప్రముఖ సంగీత దర్శకుడు తమన్



స్వామివారి సన్నిధిలో సంగీత దర్శకుడు తమన్

సింహాచలం: ఆర్‌ఆర్‌ఆర్ సినిమాకు ఆస్కార్ అవార్డు రావడంతో తెలుగు సినిమా స్థాయి ఉన్నత శిఖరాలకు వెళ్లిందని ప్రముఖ సినీ సంగీత దర్శకుడు తమన్ అన్నారు. శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామిని శనివారం ఆయన దర్శించుకున్నారు. ఆలయంలోని కప్పస్తంభాన్ని ఆలింగనం చేసుకున్నారు. ఆయన పేరిట అర్చకులు అంతరాలయంలో స్వామికి పూజలు నిర్వహించారు. వేద ఆశీర్వచనం అందజేశారు. ఈ సందర్భంగా తమన్ మాట్లాడుతూ ఆర్‌ఆర్‌ఆర్ సినిమాలో పాటకు ఆస్కార్ రావడం తెలుగు సినీ పరిశ్రమ గర్వించదగ్గ విషయమన్నారు. ప్రస్తుతం రామ్ హీరోగా.. బోయపాటి శ్రీను దర్శకత్వంలో రూపొందుతున్న సినిమాకు సంగీత దర్శకత్వం వహిస్తున్నట్టు చెప్పారు. దేవస్థానం ట్రస్ట్‌బోర్డు సభ్యులు వారణాసి దినేష్ రాజ్, సువ్వాడ శ్రీదేవి, సంపంగి శ్రీనివాసరావు తమన్ వెంట ఉన్నారు.

శ్రీ చైతన్యలో ఘనంగా 'ఫ్యామిలీ గ్లోరీ' సంబరాలు



పాదపూజ అందుకున్న విద్యార్థుల తల్లిదండ్రులు

మహారాణిపేట: స్థానిక రామ్‌నగర్ శ్రీ చైతన్య ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో స్మార్ట్ లివింగ్ ప్రోగ్రాంలో భాగంగా ఫ్యామిలీ గ్లోరీ కార్యక్రమం శనివారం జరిగింది. ఇందులో భాగంగా విద్యార్థుల తల్లిదండ్రులను పాఠశాలకు ఆహ్వానించి పాదపూజతో సత్కరించారు. ప్రిన్సిపాల్ మండా సూర్యనారాయణమూర్తి మాట్లాడుతూ ఇటువంటి కార్యక్రమాల వల్ల విద్యార్థుల్లో తల్లిదండ్రుల పట్ల గౌరవ మర్యాదలు పెరుగుతాయన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాలల ఏజీఎం ఎంవీ సురేష్, ప్రాంతీయ సంచాలకులు వై. ఆసిబాబు, అకడమిక్ జోనల్ కోఆర్డినేటర్ ఎల్. రాజేష్, డీన్ అప్పారావు, ఇన్‌చార్జిలు చంద్రశేఖర్, నారాయణరావు, జ్యోతి, ప్రసన్న , శ్రీలతరెడ్డి, నేతల రాజు, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఒక్క కార్టూన్‌తో నవరసాలు పలికించవచ్చు



కార్టూన్ వాచ్ పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న మేయర్ హరి వెంకటకుమారి తదితరులు

అల్లిపురం: ఒక్క కార్టూన్‌తో నవరసాలు పలికించవచ్చని మేయర్ గొలగాని హరి వెంకట కుమారి అన్నారు. హాస్యం, వినోదం, రాజకీయం.. ఇలా ఏదైనా కార్టూన్ ద్వారా తెలియజేయవచ్చన్నారు. మేఘాలయా హోటల్లో శనివారం జరిగిన కార్టూన్స్ వాచ్ కార్టూన్స్ ఫెస్టివల్–2023ను ఆమె ప్రారంభించారు. కార్యక్రమంలో భాగంగా కార్టూన్ వాచ్ పుస్తకాన్ని ఆమె ఆవిష్కరించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ కార్టూన్ వాచ్ ఫెస్టివల్‌ను విశాఖలో నిర్వహించినందుకు సంతోషంగా ఉందన్నారు. ఈ సందర్భంగా కార్టూన్ వాచ్ కుటుంబం ఎడిటర్ త్రయంబకశర్మను గౌరవించుకోవడం ముదావహం అన్నారు. చత్తీస్‌ఘడ్ టూరిజం ఎండీ అనిల్ సాహు, డీవీఆర్ మూర్తి మాట్లాడుతూ కార్టూన్లు ఎన్నో భావాలను తెలియజేస్తాయన్నారు. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్‌కు చెందిన ముగ్గురు కార్టూనిస్టులను సత్కరించారు. కార్టూనిస్టులు ఎం.శంకర్‌రావు, టి.వెంకటరావు, శ్రీహరి వెంకట రమణలకు లైఫ్ టైం అచీవ్‌మెంట్ అవార్డు అందుకోవడం అభినందనీయమన్నారు.

సాక్షి
మీరు సాక్షి చందాదారులుగా చేరదలుచుకున్నారా!
లేదా మీకు పేపరు అందటంలో ఇబ్బందులు ఎదురవుతున్నాయా!
సంప్రదించవలసిన నెంబరు
వైజాగ్ సౌత్
7997958342, 9912440606

లక్ష్యానికి చేరువగా..

- పన్ను వసూళ్లలో దూసుకుపోతున్న జీవీఎంసీ జోన్–4
- ఇప్పటికి రూ. 43 కోట్ల వసూలు
- రాయితీని సద్వినియోగం చేసుకుంటున్న ప్రజలు



సౌకర్యం సెంటర్‌లో బకాయిలు చెల్లిస్తున్న ప్రజలు



ఆటోల ద్వారా పన్ను రాయితీ గురించి ప్రచారం చేస్తున్న జీవీఎంసీ సిబ్బంది

జగదాంబ: గ్రేటర్ విశాఖ మున్సిపల్ కార్పొరేషన్ కల్పించిన పన్ను రాయితీతో ప్రజలు ఊరట చెందుతున్నారు. ఇప్పటి వరకు కనీసం సగం కూడా వసూలు కానీ బకాయిలు ఇప్పుడు ఏకంగా జోన్‌ను రెండవ స్థానంలో నిలిపే స్థాయిలో వసూలవుతున్నాయంటే ప్రజలు ఏ విధంగా స్పందిస్తున్నారో అర్థమవుతోంది. కేవలం పదిరోజులు వ్యవధి ఇస్తూ రాయితీ కల్పిస్తే జోన్ పరిధి 12 వార్డుల్లో 85 శాతం పన్ను వసూలయింది.

జెడ్సీ వినూత్న ప్రయత్నం..

జీవీఎంసీ చేపట్టిన ప్రతేక డ్రైవ్‌కు జోనల్ కమిషనర్ శివప్రసాద్ చేసిన వినూత్న ప్రయత్నం విజయం సాధించింది. ఈ ఏడాది రెవెన్యూ అధికారులతో కాకుండా రెవెన్యూ సెక్రటరీలతో డ్రైవ్ నిర్వహించి విజయం సాధించారు.



కరపత్రం చూపిస్తున్న జెడ్సీ శివప్రసాద్

ఉదయం నుంచి సెక్రటరీలు వార్డుల్లో ప్రతి ఇంటికి వెళ్లి కట్టాల్సిన బకాయిలు, రాయితీ వల్ల తగ్గిన వ్యత్యాసాన్ని ప్రజలకు వివరిస్తూ చేసిన ప్రయత్నం సత్ఫలితాలిచ్చింది. దీంతో ప్రజలు రాయితీని ఉపయోగించుకుని పెద్ద ఎత్తున పన్ను చెల్లింపులు చేశారు. దీని వలన కరోనా సమయంలో కట్టాల్సిన బకాయిలు కూడా ఈ ఏడాది రాయితీతో చెల్లించారు.

జోన్–4లో అసెస్‌మెంట్లు.. వచ్చిన ఆదాయం

జీవీఎంసీ జోన్–4లోని 12 వార్డుల్లో 74,337 అసెస్‌మెంట్లున్నాయి. వీటిలో ఇంటి పన్నులకు సంబంధించి 48851, ఖాళీ స్థలాలకు చెందినవి 235, నీటి పన్ను అసెస్‌మెంట్లు 25251 ఉన్నాయి. వీటి ద్వారా గత ఏడాది రూ. 35 కోట్లు వస్తే ఈ ఏడాది ఇప్పటి వరకు రూ. 43 కోట్లు వసూలు చేసి నగరంలోని ఎనిమిది జోన్లలో జోన్–4 రెండవ స్థానంలో నిలిచింది.

ఇంటి వద్దే చెల్లించవచ్చు..

సూర్యాబాగ్ కార్యాలయంలో సౌకర్యం సెంటర్‌తో పాటు అన్ని సచివాలయాల్లో కూడా పన్నులు చెల్లించడానికి అధికారులు అవకాశం కల్పించారు. అంతే కాకుండా ప్రజల సౌకర్యార్థం ఆన్‌లైన్‌లో సీడీఎంఏ పోర్టల్‌లో విశాఖపట్నం. ఈ మున్సిపల్.ఏపీ.జీవో వీ.ఇన్ అని వెబ్‌సైట్‌లో టైప్ చేసి అసెస్‌మెంట్ నంబర్, లేదా డోర్ నంబర్ ఎంటర్ చేసి నెట్ బ్యాంకింగ్ ద్వారా కూడా పన్ను చెల్లించవచ్చు. పేటీఎం.కామ్/మున్సిపల్ ద్వారాను చెల్లించవచ్చు.

కరపత్రం ద్వారా తెలుసుకున్నాం..



ఇప్పటి వరకు మేము ఎంత పన్ను బకాయి ఉన్నామో తెలియదు. ఎంత కట్టినా ఇంకా ఎంతుందో తెలిసేది కాదు. దీని వల్ల కూడా మేము పూర్తిగా పన్ను చెల్లించలేకపోయే వాళ్లం. అయితే ఇప్పుడు జీవీఎంసీ రాయితీతో పాటు చెల్లించాల్సిన పన్ను బకాయిల వివరాలు కరపత్రం ద్వారా వివరిస్తుండడంతో పూర్తి వివరాలు తెలిసి బకాయిలు చెల్లిస్తున్నాం.

–విజయలక్ష్మి, ప్రకాశరావుపేట, జీవీఎంసీ 31వ వార్డు

సులువుగా ఉంది



రాయితీ ప్రకటించడం వల్ల పన్ను చెల్లింపు కాస్త సులువుగా ఉంది. కరోనాలో చెల్లించలేని బకాయి ఇప్పుడు చెల్లిస్తున్నాం. అంతే కాకుండా సౌకర్యం సెంటర్‌లోనే కాకుండా సచివాలయల్లో కూడా చెల్లించవచ్చనే వెసులుబాటు కల్పించడంతో ఈ ఏర్పాటు సులువుగా ఉంది.

–సంతోష్‌కుమార్ పండా, అల్లిపురం, జీవీఎంసీ 29వ వార్డు

లక్ష్యం చేరుతాం

ఈ ఏడాది పన్ను వసూళ్లలో జీవీఎంసీ జోన్–4ను మొదటిస్థానంలో నిలపడానికి ప్రయత్నం చేస్తున్నాం. పన్నుల వసూలుకు కరపత్రాలతో మేము చేసిన ప్రయత్నం పెద్ద సక్సెస్ ఇచ్చింది. మొత్తం టార్గెట్ రూ.60 కోట్లు కాగా రాయితీతో ఇచ్చిన గడువు ఇంకా అయిదు రోజులు మిగిలి ఉండగానే రూ.43 కోట్లకు చేరుకున్నాం. ఈ నెలాఖరు నాటికి పూర్తిగా వసూలు చేస్తాం. సెక్రటరీల పనితీరు బాగుంది.

–కె. శివప్రసాద్, జోన్–4 కమిషనర్

ఎమ్మెల్యే వాసుపల్లి ఔదార్యం



కేజీహెచ్‌లో చికిత్స పొందుతున్న రోజారాణికి ఆర్థిక సాయం చేస్తున్న ఎమ్మెల్యే వాసుపల్లి

డాబాగార్డెన్స్: ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ ఔదార్యం చాటుకున్నారు. 29వ వార్డు రామజోగిపేటలో బిల్డింగ్ కూలిన ఘటనలో చనిపోయిన ముగ్గురికి రూ.10 వేలు చొప్పున దహన సంస్కారాల కోసం ఆర్థిక సాయం అందజేశారు. బీహార్‌కు చెందిన రామ్‌హులాష్ సాహు (చోటు), విజయనగరం జిల్లా మెరకముడిదాం మండలం, గొల్లల మర్రివలసకు చెందిన సాకేటి అంజలి, సాకేటి దుర్గాప్రసాద్ ఈ ఘటనలో మృత్యువాత పడిన సంగతి విదితమే. వీరి దహన సంస్కార ఖర్చులకు ఒక్కొక్కరికి రూ.10 వేలు చొప్పున వారి కుటుంబ సభ్యులకు మార్చురీ వద్ద అందజేశారు. అలాగే గాయాలై కేజీహెచ్‌లో చికిత్స పొందుతున్న ముగ్గురిలో ఇద్దరకి రూ.5 వేలు అందజేశారు. నూడిల్స్ షాప్‌లో పని చేస్తున్న కొమ్మిశెట్టి శివశంకర్‌కు వైద్య ఖర్చుల కోసం రూ.2,500 అందజేశారు. మొత్తంగా రూ.37,500 అందజేసి బాధితులకు అండగా నిలిచారు. ఇద్దరు పిల్లలు చనిపోయి బాధలో ఉన్న సాకేటి రామారావు, కల్యాణిలకు వైఎస్సార్ ఇళ్లు ఏర్పాటు చేస్తామని, ఇళ్లు వచ్చేంతవరకు హౌస్ రెంట్ ప్రతి నెలా ఏర్పాటు చేస్తామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు.

సంఘటనా స్థలికి..

సంఘటన జరిగిన ప్రాంతానికి ఎమ్మెల్యే వెళ్లి పరిశీలించారు. పరిసర ప్రాంతాల వారికి, రోడ్డుపై ఉన్న డెబ్రిస్ త్వరగా తొలగించాలని, అక్కడ నివసిస్తున్న వారికి ఎటువంటి ఇబ్బంది లేకుండా చూడాలని టౌన్‌ప్లానింగ్ అధికారులను ఆదేశించారు. అంతేగాక కలెక్టర్ డాక్టర్ ఎ. మల్లికార్జునతో మాట్లాడి త్వరితగతిన నష్టపరిహారం చెల్లించాలని, గాయాల పాలైన వారికి మెరుగైన వైద్యంతో పాటు ఆర్థిక సాయం, చనిపోయిన వారికి వైఎస్సార్ బీమా కల్పించాలని కోరారు. జీవీఎంసీ కమిషనర్ రాజాబాబుతో మాట్లాడిన ఎమ్మెల్యే ఇంటి యజమాని నుంచి చనిపోయిన కుటుంబ సభ్యులకు ఆర్థిక సాయం చేయించాలని కోరారు. పక్కనే నిర్మిస్తున్న ఇంటి యజమాని నుంచి కొంత ఆర్థిక సాయం చేయించాలని పోలీసు అధికారులకు తెలిపారు. ఎమ్మెల్యేతో పాటు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు మన్యాల శ్రీనివాస్, పీతల వాసు, పడాల రమణ, నీలాపు శ్రీనివాస్, కోరాడ సురేష్, ఆడపా శివ, తమ్మినేని శ్రీనివాస్, ఆరుగుల రాజు, బాధిత కుటుంబ సభ్యులు ఉన్నారు.

ఎంజీఎం ఉన్నత పాఠశాల సందర్శన



మధ్యాహ్న భోజనం రుచి చూస్తున్న భోజన పథకం అదనపు సంచాలకులు సుబ్బారెడ్డి తదితరులు

అల్లిపురం: ఆంధ్రప్రదేశ్ మధ్యాహ్న భోజన పథకం అదనపు సంచాలకులు ఎ. సుబ్బారెడ్డి శనివారం డాబాగార్డెన్స్‌లోని మహాత్మాగాంధీ మున్సిపల్ హైస్కూలును సందర్శించారు. ఆయనతో పాటు టీఎంఎఫ్ కో ఆర్డినేటర్ ఏవీ సత్యనారాయణ, జిల్లా ఎండీఎం కో ఆర్డినేటర్ జేఎస్ శాస్త్రి ఉన్నారు. ఈ సందర్భంగా వారు మధ్యాహ్న భోజన పథకం అమలు తీరును గురించి విద్యార్థులతో ముచ్చటించారు. జగనన్న గోరుముద్దలో భాగంగా నూతన మెనూ ఎలా వుందని వారిని అడిగి తెలుసుకున్నారు. ఇందులో భాగంగా రోజువారి మెనూ గురించి అడిగి తెలుసుకున్నారు. శనివారం మెనూ ప్రకారం విద్యార్థులకు వడ్డిస్తున్న భోజనం నాణ్యత పరిశీలించేందుకు ఆయన స్వయంగా భోజనం రుచి చూసి సంతృప్తి వ్యక్తం చేశారు. ఇటీవల మెనూలో నూతనంగా చేర్చిన రాగి మాల్ట్ అందరూ తాగుతున్నారో లేదో అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులు ఉపయోగించే మరుగుదొడ్లను పరిశీలించారు. అదే విధంగా మధ్యాహ్న భోజన పథకానికి సంబంధించిన రికార్డులను పరిశీలించారు. స్టాక్ రూంలో ఉన్న గుడ్లు, చిక్కీలను పరిశీలించారు. స్టాక్ డెలివరీ తీసుకున్న సమయంలో వాటి బరువు ప్రభుత్వం నిర్దేశించిన ప్రమాణాల ప్రకారం ఉందో లేదో గమనించి స్టాకు తీసుకోవాలని ప్రధానోపాధ్యాయులు ఆర్‌వీవీఎస్ నాగభూషణంకు సూచించారు. అదే విధంగా రాగిపిండి, బెల్లపు పొడి పట్ల జాగ్రత్త వహించాలన్నారు. విద్యార్థినులకు శానిటరీ నాప్‌కిన్స్ పంపిణీ ఎలా జరుగుతుంది అడిగి తెలుసుకున్నారు.

కార్మికుల ప్రయోజనాలు దెబ్బ తీస్తున్న కేంద్ర ప్రభుత్వం



సమావేశంలో మాట్లాడుతున్న సీఎఫ్‌టీయూఐ జాతీయ అధ్యక్షుడు కనకారావు

అల్లిపురం: దేశ పరువు ప్రతిష్టలు, కార్మికుల ప్రయోజనాలు దెబ్బతీసే విధంగా కేంద్ర ప్రభుత్వం వ్యవహరిస్తోందని కాన్ఫడరేషన్ ఆఫ్ ఫ్రీ ట్రేడ్ యూనియన్ ఆఫ్ ఇండియా జాతీయ అధ్యక్షుడు ఎన్.కనకారావు ఆగ్రహం వ్యక్తం చేశారు. అల్లూరి విజ్ఞాన కేంద్రంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ మోదీ సర్కార్ అనుసరిస్తున్న విధానాలను ఖండించారు. ఇంటర్నేషనల్ ట్రేడ్ యూనియన్ కాన్ఫడరేషన్ నిబంధనలకు లోబడే తామ వ్యవహరిస్తామని స్పష్టం చేశారు. కేంద్ర ప్రభుత్వం జీ–20 సమ్మిట్, బీఎంఎస్ కార్మిక సంఘం అధ్యక్షతన నిర్వహించాలని వివాదాస్పద నిర్ణయం తీసుకుందన్నారు. ఆర్‌ఎస్‌ఎస్, బీజేపీకి అనుబంధమైన బీఎంఎస్ కార్మిక సంఘానికి పెత్తనం అప్పగించడంపై మండిపడ్డారు. కార్మికుల ప్రయోజనాలను దెబ్బతీసే విధానాలు విడనాడకుంటే కేంద్ర ప్రభుత్వానికి తగిన గుణపాఠం తప్పదని హెచ్చరించారు. సీఎఫ్‌టీయూఐ నూతన కార్యవర్గ వివరాలను వెల్లడించారు. జాతీయ అధ్యక్షుడిగా ఎన్.కనకారావు, ప్రధాన కార్యదర్శిగా నీరజ్ చౌటే, కార్యనిర్వాహక అధ్యక్షుడిగా నిస్సీ, మాయ పాండ్యా, దాసరి సురేష్‌బాబు, డిప్యూటీ జనరల్ సెక్రటరీగా కె. లక్ష్మి, కార్యనిర్వాహక కార్యదర్శిగా టీవీ రమణ, ఎన్.సత్యనారాయణ జనరల్ కౌన్సిల్ సభ్యులుగా ఎన్నికయ్యారు.

చేతివృత్తి కళాకారులకు గుర్తింపు కార్డులు



చేతివృత్తి కళాకారులు తయారు చేసిన వస్తువులు పరిశీలిస్తున్న బడిగించల విజయలక్ష్మి

డాబాగార్డెన్స్: చేతివృత్తి కళాకారులకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర హస్తకళల అభివృద్ధి కార్పొరేషన్ చైర్‌పర్సన్ బడిగించల విజయలక్ష్మి శనివారం గుర్తింపు కార్డులు అందజేశారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి సూచనలతో రెండు రోజుల పర్యటనకు విచ్చేసిన ఆమె శనివారం పాతనగరంలో గల రోల్డ్‌గోల్డ్ (ఇమిటేషన్ జ్యూయలరీ) ఆభరణాల తయారీ హస్త కళాకారులను కలుసుకుని, వారు తయారు చేసిన వస్తువులు పరిశీలిస్తూ సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ముఖ్యమంత్రి ప్రవేశపెట్టిన నవరత్నాలు, అమ్మఒడి, వైఎస్సార్ చేయూత, ఆసరా, చేదోడు వంటి పథకాలతో హస్త కళాకారులు ఎంతో అభివృద్ధి చెందుతున్నారన్నారు. ఈ సందర్భంగా హస్తకళాకారులు పలు సమస్యలను ఆమె దృష్టికి తీసుకొచ్చారు. డీసీహెచ్ నుంచి గుర్తింపు కార్డులు అందజేయాలని, ఎంఎస్‌ఎంఈ రుణాలు బ్యాంకుల ద్వారా ఇప్పించాలని, ఆధునిక డిజైన్లపై శిక్షణ ఇప్పించాలని, లేపాక్షి ఎంపోరియంలలో స్టాళ్లు కేటాయించాలని కోరారు. సానుకూలంగా స్పందించిన చైర్‌పర్సన్ వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో దేవుడు, సోమేష్, పురుషోత్తం, సూరిబాబు, లక్ష్మి, ఎన్. శ్రీదేవి, సన్యాసమ్మ, మహాలక్ష్మి, మహిళా హస్త కళాకారులు పాల్గొన్నారు.

ఇందిరా ప్రియదర్శిని స్టేడియంను అభివృద్ధి చేయాలి



కౌన్సిల్‌లో మాట్లాడుతున్న కార్పొరేటర్ విల్లూరి భాస్కరరావు

డాబాగార్డెన్స్: జీవీఎంసీ 35వ వార్డులో గల ఇందిరా ప్రియదర్శిని మున్సిపల్ స్టేడియంను అభివృద్ధి చేసి క్రీడాకారులకు అందుబాటులోకి తేవాలని వార్డు కార్పొరేటర్ విల్లూరి భాస్కరరావు శనివారం కార్పొరేషన్లో గళం విప్పారు. జీవీఎంసీ బడ్జెట్ చాలా బాగుందని చెబుతూ.. విశాఖపట్నానికి గుండెకాయ వంటి దక్షిణ నియోజకవర్గంలో మున్సిపల్ స్టేడియం 35 ఏళ్ల కిందట ఏర్పాటు చేశారని, కనీస మౌలిక సదుపాయాలు, గ్రీన్ గార్డెనింగ్ లేక క్రీడాకారులు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. బడ్జెట్‌లో స్టేడియం అభివృద్ధికి నిధులు కేటాయించాలని కోరారు. అలాగే వార్డు పరిధి వెలంపేట హెడ్‌పోస్టాఫీస్ ఎదురుగా గల లక్ష్మీనగర్‌లో సుమారు 70 ఏళ్ల పైబడి 175 కుటుంబాలు నివాసం ఉంటున్నాయని, కరెంటు లేక, యూజీడీ వంటి సదుపాయాలు లేక వారంతా అనేక ఇబ్బందులు పడుతున్నారని కౌన్సిల్ దృష్టికి తీసుకొచ్చారు. వారికి ఇళ్లు నిర్మించి మౌలిక సదుపాయాలు కల్పించాలని కోరారు.

ఎస్సీ, ఎస్టీ న్యాయవాదుల విజయమే ధ్యేయం



వర్క్‌షాప్‌లో మాట్లాడుతున్న ఫౌండేషన్ రాష్ట్ర అధ్యక్షుడు రామకృష్ణ

అల్లిపురం: రానున్న బార్ కౌన్సిల్ ఎన్నికల్లో ఏఏఫ్ ఎంపిక చేసిన ముగ్గురు అభ్యర్థులను గెలిపించుకోవడానికి వర్క్‌షాప్ ద్వారా నిర్మాణం చేస్తున్నామని అంబేడ్కర్ ఆలోచనా ఫౌండేషన్ (అఆ ఫౌండేషన్) రాష్ట్ర అధ్యక్షుడు రామకృష్ణ, కన్వీనర్ బైపా అరుణ్‌కుమార్ తెలిపారు. అల్లూరి విజ్ఞాన కేంద్రంలో శనివారం ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన వర్క్‌షాప్‌లో వారు పాల్గొని మాట్లాడుతూ 2024లో జరగనున్న ఎన్నికల్లో ప్రతి పార్లమెంట్ పరిధిలో ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులను పోటీలో గెలుపించుకోవడం లక్ష్యంగా పని చేయాలని పిలుపునిచ్చారు. రాష్ట్రంలో గల సుమారు 7 వేల మంది న్యాయవాదులు, గ్రూప్ ఎ అధికారులు, ఐఎఫ్‌ఎస్, ఐఆర్‌ఎస్, ఐపీఎస్, రిటైర్డ్ జడ్జిలు, డాక్టర్లు ఇలా అన్ని రంగాల్లో ఉన్న వారిని జిల్లాల వారీగా ఏకం చేయడానికి తీర్మానించారు. జ్యుడీషియరీలో నామినేటెడ్ పోస్టులు, హైకోర్టులో స్టాండింగ్ కౌన్సిళ్లు, నామినేటెడ్ పోస్టుల్లో అన్నింట రూల్ ఆఫ్ రిజర్వేషన్ అమలు చేయాలని వక్తలు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ జిల్లా జడ్జి వి.జయసూర్య, సీనియర్ న్యాయవాది జి.జయప్రకాష్‌బాబు, గుంటూరు పార్లమెంట్ అధ్యక్షుడు దాసరి శ్రీధర్, ఒంగోలు పార్లమెంట్ అధ్యక్షుడు ప్రసంగించారు. కార్యక్రమంలో వాగుపల్లి చిన్నారావు, డాక్టర్ తిగురుపల్లి బోసుబాబు, విశాఖ పార్లమెంట్ మహిళా కన్వీనర్ నాగకుమారి పాల్గొన్నారు. కార్యక్రమంలో భాగంగా విశాఖపట్నం బార్ అసోసియేషన్ అధ్యక్షుడు చింతపల్లి రాంబాబు, కార్యదర్శి పైలా శ్రీనివాసురావుతో పాటు పలువురిని ఘనంగా సత్కరించారు.

స్పోర్ట్స్ రౌండప్

ఈకోర్సాతో కావలీర్స్ పోరు

విశాఖ స్పోర్ట్స్: యూసీసీ టి–20 క్రికెట్ ఫైనల్స్‌లో ఈకోర్సా వాల్తేరుతో కావలీర్స్ సీసీ తలపడింది. శనివారం జింక్ గ్రౌండ్‌లో జరిగిన తొలి సెమీస్‌లో మొదట మాంబ సీసీ తొమ్మిది వికెట్లకు 118 పరుగులు చేసింది. అకాష్‌వర్మ 38 పరుగులు చేయగా.. డేవిడ్‌రాజు నాలుగు వికెట్లు తీసి హాట్రిక్ సాధించాడు. ప్రతిగా ఈకోర్సా వాల్తేరు ఆరు వికెట్లు కోల్పోయి విజయలక్ష్యాన్నందుకుంది. త్రినాథ్ 28, శ్యామ్ 24పరుగులు చేశారు. కిషోర్, అప్పలరెడ్డి రెండేసి వికెట్లు తీశారు. మరో మ్యాచ్‌లో మెట్రో సీసీపై కావలీర్స్ ఆరువికెట్ల తేడాతో విజయం సాధించింది. మెట్రోసీసీ తొమ్మిది వికెట్లకు 161పరుగులు చేసింది. యువన్ 73పరుగులతో రాణించాడు. ప్రతిగా కావలీర్స్‌సీసీ నాలుగు వికెట్లు కోల్పోయి విజయలక్ష్యాన్నందుకుంది. పాండు రంగరాజు 59 పరుగులు చేయగా అభినవ్ 37 పరుగులు చేశాడు.

2న బాడీలిఫ్టింగ్ పోటీలు

ఆంధ్ర బాడీ లిఫ్టింగ్ పోటీలు ఏప్రిల్ 2 న జరగనుంది. 55–80 కేజీలు పైబడిన వారికి ఏడు గ్రూప్‌ల్లో పోటీలు మెన్‌కు జరగనున్నాయి. ఆంధ్రబాడీ లిఫ్టింగ్ సంఘం ఆధ్వర్యంలో మాస్టర్స్‌కు 40నుంచి 50+ వారికి మూడు గ్రూప్‌ల్లో పోటీలను నిర్వహించనున్నారు. పోటీల్లో పాల్గొనే వారు రూ.500 ప్రవేశరుసుం చెల్లించాలని నిర్వాహకులు పేర్కొన్నారు.

ఘనంగా మహిళా దినోత్సవం

క్రీడాప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన మహిళా దినోత్సవం శనివారంతో ముగిసింది. ఈ సందర్భంగా నిర్వహించిన పలు క్రీడాంశాల్లో పోటీల విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో కార్పొరేటర్ ఉష , శోభారాణి, సెట్విస్ సీఈవో పి.నాగేశ్వరరావు పాల్గొన్నారు. కార్యక్రమాన్ని వీడీ ఎస్‌ఏ చీఫ్ కోచ్ సూర్యారావు పర్యవేక్షించారు.


స్కాడా సిస్టం పనితీరు భేష్



స్కాడా వాటర్ మానిటరింగ్ సిస్టం పనితీరుపై అధికారులతో మట్లాడుతున్న మంత్రి సురేష్

మద్దిపాలెం: రాష్ట్ర ప్రభుత్వం ఆతిథ్యమివ్వనున్న జీ–20 సదస్సును ప్రతిష్టాత్మకంగా నిర్వహించనున్నామని రాష్ట్ర మున్సిపల్ శాఖ మంత్రి ఆదిమూలపు సురేష్ తెలిపారు. విశాఖలో శనివారం పర్యటించిన ఆయన.. జీ20 సదస్సులో భాగంగా విదేశీ ప్రతినిధులు వీక్షించేందుకు వీలుగా 51వ వార్డు రవాణా శాఖ కార్యాలయ సమీప పంప్‌హౌస్‌లో ఏర్పాటు చేసిన 24/7 నీటి సరఫరా స్కాడా వాటర్ మానిటరింగ్ సిస్టంను పరిశీలించారు. దాని పనితీరును మంత్రికి మేయర్ గొలగాని హరివెంకటకుమారి, జీవీఎంసీ కమిషనర్ పి.రాజాబాబు వివరించారు. ఈ సందర్భంగా మంత్రి సురేష్ మాట్లాడుతూ ప్రజలకు నిరంతరం తాగునీటిని అందించేందుకు రూ.400 కోట్లతో స్కాడా వాటర్ మానిటరింగ్ సిస్టంను అందుబాటులోకి తెచ్చామని చెప్పారు. విశాఖకే తలమానికంగా చేపట్టిన మానవ రహిత ఎలక్ట్రానిక్ సిస్టం ద్వారా నగరంలో 3 లక్షల మందికి 60 వేల తాగునీటి కనెక్షన్లు ఇచ్చామన్నారు. ప్రజలకు 24 గంటల పాటు నీటిని అందించడంతోపాటు లీకేజీలను గుర్తించి తక్షణం అదుపులోకి తెచ్చేందుకు ఈ సిస్టం ఎంతగానో ఉపయోగపడుతుందని తెలిపారు. ఇప్పటికే ఇతర రాష్ట్రాల్లో ఇటువంటి యంత్రాలు ఉన్నప్పటికీ స్కాడా వాటర్ మానిటరింగ్ పనితీరు మెరుగ్గా ఉన్నట్లు గుర్తించామన్నారు. మంత్రి వెంట జీవీఎంసీ డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్, కార్పొరేటర్ రెయ్యి వెంకటరమణ, జీవీఎంసీ నీటి విభాగం సూపరింటెండెంట్ ఇంజినీర్ రవి, జోన్–5 కమిషనర్ ఆర్‌జీవీ కృష్ణ, అడిషనల్ కమిషనర్ వై.శ్రీనివాసరావు, ఈఈ ఏడు కొండలు, ఏఈ గణేష్ తదితరులు ఉన్నారు.

ఘనంగా ఏఎంసీ స్నాతకోత్సవం



వైద్య విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేస్తున్న జస్టిస్ సోమయాజులు

మహారాణిపేట: ఆంధ్రా మెడికల్ కాలేజీ శతాబ్ది ఉత్సవం, ఎంబీబీఎస్ 96వ స్నాతకోత్సవం ఏయూ కన్వెన్షన్ సెంటర్‌లో శనివారం ఘనంగా జరిగాయి. 2017 బ్యాచ్‌కు చెందిన విద్యార్థులు, అధ్యాపకులకు ఆంధ్రా మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ జి. బుచ్చిరాజు స్వాగతం పలికారు. రిటైర్డు డీఎంఈ ప్రొఫెసర్ డాక్టర్ ఆర్. శశిప్రభ, ఏఎంసీ మాజీ ప్రిన్సిపాల్ డాక్టర్ పీవీ సుధాకర్ గౌరవ అతిథులుగా విచ్చేసి వైద్య వృత్తి ప్రాముఖ్యతపై ప్రసంగించారు. ఏపీ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ డీవీఎస్ఎస్ సోమయాజులు ముఖ్య అతిథిగా హాజరై స్నాతకోత్సవాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన 2017 ఎంబీబీఎస్ బ్యాచ్‌ను అభినందించారు. వైద్యులు మానవతా దృక్పథంతో రోగులకు సేవ చేయాలన్నారు. వైద్య విద్యార్థులకు సర్టిఫికెట్లు అందించారు. డాక్టర్ జి. రాజేంద్రప్రసాద్, వైస్ ప్రిన్సిపాల్ (అడ్మిన్) కొత్తగా ఉత్తీర్ణులైన మెడికల్ గ్రాడ్యుయేట్లతో ప్రమాణం చేయించారు. 2017 బ్యాచ్‌కు చెందిన ఇద్దరు ఉత్తమ విద్యార్థులు డాక్టర్ శ్యామా మదిన్య, డాక్టర్ డి.వైష్ణవి ప్రియాంక అధ్యాపకులు, తల్లిదండ్రులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఎంబీబీఎస్ 2017 బ్యాచ్ పూర్వ విద్యార్థులు నిర్మిస్తున్న సెంటినరీ అకడమిక్ బ్లాక్ నిర్మాణానికి రూ. 2 లక్షల చెక్కును అందజేశారు.



ఏఎంసీ స్నాతకోత్సవంలో పాల్గొన్న హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సోమయాజులు తదితరులు

నేడు ఉచిత మెగా వైద్య శిబిరం

మురళీనగర్: మురళీనగర్ వాకర్స్ పార్కులో వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు క్లబ్ అధ్యక్షుడు పల్లా చంద్రమౌళి ఒక ప్రకటనలో తెలిపారు. క్లబ్ ఏర్పడిన తర్వాత మొట్టమొదటిసారిగా మదర్ అండ్ చైల్డ్ కేర్‌కు సంబంధించి ప్రముఖ వైద్య నిపుణులతో ఈ శిబిరం ఏర్పాటు చేస్తున్నామన్నారు. పిల్లల వైద్యంతోపాటు మహిళల సమస్యలు, సాధారణ వ్యాధులకు సంబంధించిన వైద్య నిపుణులు పరీక్షలు నిర్వహిస్తారన్నారు. అపోలో ఆస్పత్రి సౌజన్యంతో వైద్య శిబిరాన్ని ఉదయం 8.30 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు నిర్వహిస్తామన్నారు. చిన్నపిల్లలతో పాటు అన్ని వయసుల వారు పాల్గొని పరీక్షలు చేయించుకోవాలని కోరారు.

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
వైజాగ్ సౌత్
9010196663
Office mail : sakshiadvtvsp@gmail.com